క్లుప్తంగా

ఘనంగా గౌరీశంకరుల ఉత్సవం


ఊరేగింపు నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

దెందులూరు: పోతునూరు గ్రా మంలో గౌరీ శంకరుల 44వ వార్షిక మహోత్సవాలు బు ధవారం ప్రారంభమయ్యాయి. నెలరోజుల ఈ మహోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మహోత్సవాల ప్రారంభోత్సవం సందర్భంగా ఆలయం నుంచి మేళతాళాలతో పొలానికి వెళ్లి అక్కడి పచ్చని పంట దుబ్బులను తీసుకొని ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం దేవతామూర్తుల కల్యాణం నిర్వహించారు.

అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు


అయ్యప్ప స్వామికి పూజలు చేస్తున్న పూజారి

భీమడోలు: భీమడోలు అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం అయ్యప్పస్వామి వారికి విశేష పూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రీతికరమైన రోజు కావడంతో భక్తిశ్రద్ధలతో మాలధారులు పూజలు చేశారు. ఆలయంలో గణపతి, మురుగన్, అయ్యప్ప ఉత్సవ విగ్రహాలకు విశేష పంచామృత, సుగంధ, నారికేళ, అభిషేకాలను ప్రత్యేక పూజలు చేశారు. గురుస్వామి అల్లూరి రాఘవేంద్రరావు ఆధ్వర్యంలో మాలధారణ చేశారు. కార్యక్రమంలో పూజారి, భక్తులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడి హేయం



ధర్నా చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

గణపవరం: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడి హేయనీయమని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా కార్యదర్శి చిన్నం చిననాగేశ్వరావు అన్నారు. గవాయ్‌పై దాడికి నిరసనగా కేవీపీఎస్ నాయకులు గణపవరం మండలం వరదరాజపురం గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాడికి పాల్పడిన నిందితుడిని దేశ ద్రోహిగా ప్రకటించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గుర్రం సుబ్బారావు, కేవీపీఎస్ నాయకులు బి.అశోక్, కట్టూరి ప్రసాద్, కుసువే రాజు, మొగసాల శ్రీను, అద్దంకి రాజేందర్, మాదాసి చినబాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి గ్రామోత్సవం


రథంపై ఊరేగుతున్న అమ్మవారు

భీమడోలు: మండలంలోని భీమడోలు పంచాయతీ శివారు నరెల్లగూడెంలోని శ్రీకనక దుర్గాదేవి పీఠం వద్ద దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ముగింపును పురస్కరించుకుని దేవి ఉపాసకులు వర్ధినేడి కపిరాజు ఆధ్వర్యంలో బుధవారం సుందరంగా అలంకరించిన రథంపై అమ్మవారిని ఊరేగించారు. నరెల్లగూడెం గ్రామం నుంచి భీమడోలు మీదుగా పోలసానిపల్లి గ్రామాల్లో ఊరేగింపు ఆకట్టుకుంది. మంగళవాయిద్యాలు నడుమ అమ్మవారికి వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఈ ఊరేగింపులు ఘనంగా నిర్వహించారు.

నిమ్మలో ఎండు తెగులు


ఎండు తెగులు సోకిన నిమ్మతోట

దెందులూరు: నిమ్మ తోటల్లో ఎండు తెగులు ఆశించడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దెందులూరు, పెదవేగి మండలాల్లో వరి, పామాయిల్, మొక్కజొన్న తరువాత అధికంగా సాగు చేసే పంట నిమ్మ. కొన్ని మొక్కలు పూర్తిగా ఎండిపోవడం, కొన్ని మొక్కలు ఎండి పడిపోవడం, మరి కొన్ని మొక్కలు కాపు కాయకపోవడం జరుగుతోందని రైతులు అంటున్నారు. దీనిపై హార్టికల్చర్ ఆఫీసర్ కరన్‌ను వివరణ కోరగా నిమ్మ తోటల్లో పూర్తిగా ఎండిపోయిన మొక్కలు, పడిపోయిన మొక్కలను వెంటనే మొదలుకు తొలగించాలి. తోట నుంచి దూరంగా పారవేయాలి. గ్రామాల్లో రైతుసేవా కేంద్రాల్లో ఉన్న హార్టికల్చర్ అసిస్టెంట్లను కలిసి మొక్కలను చూపించి పరిస్థితిని బట్టి నివారణ చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు.

వరి పంటపై మూషికాల దాడి

- పెరుగుతున్న పెట్టుబడి ఖర్చు
- బ్రోమోడయోలిన్ మందు సరఫరా చేసిన వ్యవసాయ శాఖ


ఎలుక కొట్టిన వరి చేను

పెదవేగి: నాట్లు వేసినప్పటి నుంచి పంట చేతికొచ్చే వరకు రైతులు ఆరుగాలం శ్రమిస్తారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టాలను ఎదుర్కొంటారు. అతివృష్టి, అనావృష్టి పరిస్థితులను ఎదుర్కొని కర్షకులు వ్యవసాయం చేస్తున్నారు. ప్రస్తుత ఖరీఫ్‌లో మూషికాలు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. నారుమడి దశనుంచి ఎలుకలు అన్నదాతనే కలవరపెడుతున్నాయి. సామూహికంగా ఎలుకల నిర్మూలనకు ప్రభుత్వం రైతులకు ఉచితంగా బ్రోమోడయోలిన్ మందును సరఫరా చేసింది. దీని వలన ఆశించిన ఫలితాలు వచ్చే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

ఎలుకల నివారణలో రైతులు బిజీ

ప్రస్తుతం చాలా చోట్ల పొలాలు చిరు పొట్ట, ఈనిక దశలో ఉన్నాయి. వరి దుబ్బు తీపి అధికంగా ఉండడంతో ఈ దశలో వరిపై మూషికాల దాడి పెరిగింది. ప్రస్తుతం ఎలుకల నివారణ కోసం బొరియల్లో పొగపెట్టి చంపడం, బుట్టలు పెట్టడం, నివారణకు మందులను వినియోగించడంలో రైతులు బిజీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఎలుకలను పట్టుకునే వారికి గిరాకీ పెరిగింది. ఎలుకలు రూ.50 నుంచి రూ.70 వరకు డిమాండ్ చేస్తున్నారు. పెట్టుబడి ఖర్చు అధికమవుతున్న తరుణంలో ఎలుకల నివారణ రైతులకు అదనపు భారమవుతోంది. నియోజకవర్గంలో దెందులూరు, పెదవేగి, పెదపాడు, ఏలూరు మండలాల్లో 50,000 ఎకరాల్లో వరిసాగు చేపడుతున్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం

చిరుపొట్ట దశలో ఉండగా ఎలుకల దాడి అధికమవుతోంది. ఈ ఏడాది ఎలుకల ఉధృతి అధికంగా ఉన్న మాట వాస్తవమే. గతంలో ప్రభుత్వం ఎలుకల నివారణ కార్యక్రమం వారం, పది రోజులు నిర్వహించేది. సామూహిక ఎలుకల నిర్మూలనపై రైతులకు అవగాహన కల్పించాం.

– సీహెచ్ శ్రీనివాసరావు, వ్యవసాయాధికారి, పెదవేగి

నెమ్మదిగా పని చేస్తుంది

బ్రోమోడయోలిన్ మందు ఎలుక శరీరంపై విష ప్రభావాన్ని నెమ్మదిగా చూపుతుంది. ఈ విధానంతో ఎరను తిన్న ఎలుకలు మృతి చెందుతాయి. చేల గట్లపై ఎలుక కన్నాలను గుర్తించి పొగబెట్టి మూసి వేయడం ద్వారా కూడా ఎలుకలను చంపొచ్చు. ఎలుకల ఉధృతి అధికంగా ఉన్నప్పుడు ఎకరాకు దాదాపుగా నాలుగు నుంచి ఎనిమిది బస్తాల వరకు దిగుబడి తగ్గే అవకాశం ఉంది.

దాత ఔదార్యంతో వసతుల కల్పన


దాత ఏర్పాటు చేసిన పైపులైన్

దెందులూరు: ఓ మదిలో మెదిలిన నవ సమాజపు ఆలోచనలు ఆ గ్రామంలో పాఠశాల అభివృద్ధి చేశాయి. విద్యార్థులు అందరూ చదవాలనే ఆలోచనతో సానిగూడెం గ్రామంలో పాఠశాల హెచ్‌ఎం కేవీవీ సుబ్బారావు సొంతంగా రూ.80 వేలతో పాఠశాలను అన్ని సౌకర్యాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. బాత్‌రూమ్‌లకు డోర్లు, పాఠశాల గదులకు కిటికీలు, తలుపులు, మోటర్, వాటర్ ట్యాంక్, పైపులైన్ పాఠశాల చుట్టూ ఫెన్సింగ్, పాఠశాల ఆవరణలో ప్లాస్టింగ్ పనులను సొంత నిధులతో చేశారు. గ్రామానికి చెందిన ఎం ఈశ్వరరావు రూ.20 వేలు కిటికీలకు సాయం అందించారు. పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దిన హెచ్‌ఎం సుబ్బారావును విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు, అధికారులు అభినందించారు.

ప్రజాభిప్రాయ సేకరణ


ప్రజాభిప్రాయ సేకరణలో సమస్యలు వివరిస్తున్న రైతులు

భీమడోలు: జాతీయ రహదారి పి.కన్నాపురం, కోడూరుపాడు గ్రామాల్లో రైల్వే గేట్లు మూసి వేసి రైల్వే అభివృద్ధి పనులు చేపట్టనున్న నేపథ్యంలో బుధవారం ప్రజాభిప్రాయ సేకరణ, ఆ ప్రాంతాలను పరిశీలించేందుకు రైల్వే అధికారులు, రెవెన్యూ ఉన్నతాధికారుల బృందం పర్యటించింది. ఈ నేపథ్యంలో పి.కన్నాపురం రైల్వే గేటు సమీపంలోని పూళ్ల వద్ద రైతులు, ప్రజలతో వారు సమావేశాన్ని నిర్వహించి, అభిప్రాయాలను సేకరించారు. పి.కన్నాపురం లెవెల్ క్రాసింగ్ 363 ఏ గేటు మూసి వేసినట్లయితే ఇక్కడ ఫ్లెఓవర్ గాని, అండర్ పాస్ గాని నిర్మించాలని గ్రామస్తులు, రైతులు ముక్త కంఠంతో డిమాండ్ చేశారు. అయితే కోడూరుపాడు వద్ద ఫ్లై ఓవర్ నిర్మిస్తున్నందున, కనెక్షన్ రోడ్డును రైల్వే నిధులతో నిర్మించి, ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని రైల్వే అధికారులు రైతులకు వివరించారు. దీనిపై రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో రైల్వే ఉన్నతాధికారులకు ఈ సమస్యను తీసుకెళతామని అధికారులు అన్నారు. కార్యక్రమంలో ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, అప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఏలూరు ఆర్డీవో అచ్యుత అంబరీష్, రైల్వే ఉన్నతాధికారులు, తహసిల్దార్ బి.రమాదేవి, సర్పంచ్ దాయం సుజాత, పెద్దలు, రైతులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థిని పరామర్శించిన డీఈవో


పాఠశాలలో విచారణ చేస్తున్న డీఈఓ వెంకటలక్ష్మమ్మ

దెందులూరు: కరెంట్ షాక్‌తో ప్రమాదానికి గురైన గోపన్నపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థి కార్తీక్‌ను బుధవారం ఆశ్రం హాస్పిటల్ ఐసీయూలో జిల్లా విద్యాశాఖ అధికారిణి వెంకట లక్ష్మమ్మ పరామర్శించారు. కార్తీక్ ఆమెతో మాట్లాడాడు. ఆరోగ్యం, వైద్య సేవలపై సంబంధిత వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గోపన్నపాలెం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుభాషిణి, విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలలో డీఈఓ విచారణ:

గోపన్నపాలెం ఉన్నత పాఠశాలలో బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారిణి వెంకట లక్ష్మమ్మ విచారణ చేశారు. పాఠశాలలో కరెంట్ షాక్‌తో విద్యార్థి, టీచర్ ప్రమాదానికి గురైన పరిస్థితులపై ఆరా తీశారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు సిబ్బంది విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి డీఈవో భోజనం చేశారు.

జీఎస్టీ తగ్గింపు హర్షణీయం

భీమడోలు: జీఎస్టీ తగ్గింపుతో విద్యార్థులు, రైతులు, ప్రజలకు మేలు కలుగుతుందని హర్షించదగ్గ విషయమని జీఎస్టీ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ ధవళేశ్వరరావు అన్నారు. భీమడోలులోని మాధురి కళాశాల, శ్రీవేంకటేశ్వర కళాశాలల్లో బుధవారం జీఎస్టీ తగ్గింపుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎంఈవో ఈదుపల్లి శ్రీనివాసరావు, కె.ప్రేమ్‌కుమార్, రాగల అశోక్, పి.బాలు పాల్గొన్నారు.

ఆటల పోటీలు ప్రారంభం

పెదపాడు: మండలంలోని వట్లూరులో మండల స్థాయి ఆటలపోటీలు బుధవారం ప్రారంభించారు. ఈ పోటీల్లో వివిధ గ్రామాలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో లాంగ్‌జంప్, హైజంప్, రన్నింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలను జిల్లా స్థాయి పోటీలకు పంపనున్నట్లు మండల విద్యాశాఖాధికారి సబ్బితి నర్సింహమూర్తి తెలిపారు.

దాడి కేసు నమోదు

పెదపాడు: పాత గొడవలను పురస్కరించుకుని ఓ వ్యక్తిపై దాడి చేసిన మరో వ్యక్తిపై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. నూజివీడు మండలంలోని పల్లెర్లమూడి గ్రామానికి చెందిన బోడగిరి నాని మంగళగిరి తీన్‌మార్ డప్పు వాయిద్యానికి వెళ్లి తిరిగి వచ్చి మండలంలోని ఏపూరు గ్రామ శివారు అంధ్రియపురం వద్ద టీ తాగేందుకు ఆగాడు. తన పెదనాన్న కుమారుడు బోడగిరి సాల్మన్ రాజు పాత గొడవల నేపథ్యంలో తలపై రాయితో మోదాడు. దీంతో గాయాలైన నాని ఏలూరు గవర్నమెంట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి వర్గాల సమాచారం మేరకు పెదపాడు ఎస్సై కట్టా శారదాసతీష్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

వారోత్సవాల ముగింపు

జంగారెడ్డిగూడెం: వృద్ధులు సమాజానికి గ్రంథాలయాల వంటి వారని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. జంగారెడ్డిగూడెంలో అంతర్జాతీయ వృద్ధుల వారోత్సవాల ముగింపు సందర్భంగా బాపూజీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సీనియర్ సిటిజన్స్ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని వాగ్దానం చేశారు. జంగారెడ్డిగూడెం మున్సిపల్ చైర్మన్ బత్తిన లక్ష్మీ మాట్లాడుతూ వృద్ధులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.రాధాకృష్ణమూర్తి, కుకునూరి రామచంద్రరావు పాల్గొన్నారు.

పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి


మండలంలోని ఎన్ఆర్ పాలెంలో వంట షెడ్‌ను పరిశీలిస్తున్న పీఓ

బుట్టాయగూడెం: మండలంలోని పలు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలను ఐటీడీఏ పీఓ కె.రాములు నాయక్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నూతిరామన్నపాలెం, రాజానగరం, కేఆర్‌పురం జూనియర్ కాలేజీలను సందర్శించి బాత్‌రూమ్‌లు, వంటగది, వాటర్ ట్యాంక్‌లు, విద్యార్థుల స్నానాల గదులను పరిశీలించారు. అదే విధంగా మంచినీటి బోర్‌వెల్‌లో ఉన్న నీటిని పరీక్షలు నిర్వహించాలని ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం ఏఓ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశాల మేరకు పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేశామని చెప్పారు. ఆశ్రమ పాఠశాలలో, వసతిగృహాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో నివేదికలు అందించాలి


సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఐఓ

బుట్టాయగూడెం: ప్రస్తుతం ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు సమ్మెలో ఉన్నప్పటికీ ఆసుపత్రి ద్వారా అందించే అన్ని రకాల సేవలు సక్రమంగా జరిగేలా చూడాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి శోభ అన్నారు. మండలంలోని నందాపురం పీహెచ్‌సీని డీఐఓ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో వ్యాక్సిన్ కేరియర్లను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైద్యులు లేకపోయినప్పటికీ ఏ ఒక్క రిపోర్ట్ ఆగకూడదన్నారు. ఎప్పటికప్పుడు రిపోర్టులు తమకు పంపించాలన్నారు. అనంతరం నిమ్మలగూడెంలో గర్భిణులు, బాలింతలతో ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీపీహెచ్ఎన్ఓ బి.జ్యోతి, ఎంపీహెచ్ఈఓ పి.పెద్దిరాజు, సూపర్‌వైజర్ పి.ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలు వెలికితీయాలి


భీమడోలు: పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో శ్రీనివాసరావు, హెచ్‌ఎం, పీడీలు


దెందులూరు: పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ మధులత

భీమడోలు: విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికి తీసేందుకు పోటీలు ఎంతగానో దోహద పడతాయని భీమడోలు ఎంఈవో-1 ఈదుపల్లి శ్రీనివాసరావు అన్నారు. భీమడోలు ఉన్నత పాఠశాల ప్రాంగణంలో బుధవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి పోటీలు ఆట్టహాసంగా ఎంఈవో-1 ఈదుపల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు. మధ్యాహ్నం ఒక్కసారిగా కురిసిన భారీ వర్షానికి క్రీడా పోటీలు నిలిచిపోయాయి. తొలుత అండర్-14, అండర్-17 విభాగాల్లో బాల బాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఏడు ఉన్నత పాఠశాలలకు చెందిన 280 మంది బాలబాలికలు పాల్గొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పద్మజ, కో-ఆర్డినేటర్ రాంబాబు, పీడీలు టి.త్రిపురస్వాతి, సోమశేఖర్, సురేష్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి

గణపవరం: విద్యార్థులు చదువుతో పాటు, క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎంఈవో గొర్రెల బాలయ్య, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ నిర్మలకుమారి అన్నారు. బుధవారం గణపవరం మండల స్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆటలపోటీలు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఆవరణలో నిర్వహించారు. అండర్-14,అండర్-17 విభాగాలలో బాలురకు కబడ్డీ, ఖోఖో, చెస్, వాలీబాల్ వంటి పలు విభాగాలలోను, అథ్లెటిక్స్ లోనూ పోటీలు నిర్వహించారు. గురువారం బాలికలకు పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలను డివిజన్ స్థాయి పోటీలకు పంపనున్నట్లు ఎంఈవో తెలిపారు. కార్యక్రమంలో బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గంటా వీరవేణి తదితరులు పాల్గొన్నారు.

నిరంతర సాధనతోనే విజయాలు


దెందులూరు: ప్రణాళిక, నిరంతర సాధనతోనే ఎంచుకున్న రంగాల్లో విజయం సాధ్యమని కొవ్వలి గ్రామ సర్పంచి ఇంటేటి మధులత గంగాధర్ అన్నారు. బుధవారం కొవ్వలి ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఎస్ఎల్ఎన్‌వీజీ శర్మ అధ్యక్షతన పీడీ జక్కుల సురేష్ కుమార్ ఆధ్వర్యంలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ పోటీలను సర్పంచ్ ప్రారంభించారు. పీడీ సురేష్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో 300 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నార న్నారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ బీద గణేష్ కుమార్, రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

382 పశువులకు టీకాలు


పశువులకు టీకాలు వేస్తున్న అధికారులు

దెందులూరు: పశు సంవర్ధక శాఖ ద్వారా పశువులకు ఉచితంగా గాళ్ల నివారణ టీకాలు వేశామని నాగులదేవునిపాడు జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ రాములయ్య దొర అన్నారు. బుధవారం జోగన్నపాలెంలో పశువులకు గాళ్ల నివారణ టీకాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగులదేవునిపాడు పశు వైద్యశాల పరిధిలో 382 పశువులకు టీకాలు వేశామన్నారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులపై సమీక్ష


సమీక్ష సమావేశంలో పాల్గొన్న అధికారులు

ఉంగుటూరు: రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు కైకరం, పూళ్లలో ప్రారంభించనున్నారు. ఈ మేరకు బుధవారం రైల్వే అధికారులు, స్థానిక అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గేట్లు మూసి వేసే క్రమంలో ప్రజలకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపించే విషయంలో చర్చించారు. బ్రిడ్జి వెళ్లే మార్గంలో సేకరించిన స్థలాలను పరిశీలించారు. సమావేశంలో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ఏలూరు ఆర్డీవో అచ్యుత్ అంబరీష్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

13 వరకు ఏపీ గ్రామీణ బ్యాంక్ సేవలు నిలుపుదల


నాగార్జున

దెందులూరు: సాంకేతిక కారణాలతో నేటి నుంచి ఈ నెల 13వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఏపీ గ్రామీణ బ్యాంకు సేవలు నిలిచిపోతాయని దెందులూరు శాఖ బ్యాంక్ మేనేజర్ నాగార్జున అన్నారు. బుధవారం బ్యాంక్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, ఏటీఎం డిపాజిట్లు విత్‌డ్రాలు, యూపీఐతో పాటు ఇతర అన్ని సేవలు నిలుపుదల చేస్తామన్నారు. వినియోగదారులు మూడు రోజుల పాటు కలిగే అసౌకర్యాన్ని గమనించాలని మేనేజర్ నాగార్జున కోరారు.

మలుపుల్లో పొంచి ఉన్న ప్రమాదం


రోడ్లను మూసేసిన చెట్లు

దెందులూరు: మండలంలో రోడ్ల కిరువైపులా మొక్కలు, చెట్లు పెరిగి కొన్నిచోట్ల రోడ్లు కనపడని పరిస్థితి నెలకొంది. మరికొన్ని చోట్ల మలుపుల్లో ఏ క్షణానైనా రెండు వైపులా ఒకేసారి వాహనాలు వస్తే ప్రమాదాలు జరగే అవకాశం ఉందని ప్రయాణికులు వాపోతున్నారు. పంచాయతీ, ఆర్అండ్‌బీ సిబ్బంది స్పందించి మలుపుల ప్రాంతాల్లో చెట్ల కొమ్మలను తొలగించాలని వాహనదారులు, పాదచారులు కోరుతున్నారు.

రుద్రభూమిలో జల్లు స్నానం ప్రారంభం

ఉంగుటూరు: కైకరం తూర్పు వైపు రుద్రభూమి మహా ప్రస్థానంలో రూ.70వేలతో దాతలు ఏర్పాటు చేసిన జల్లు స్నానాన్ని మెట్ల శంకర్ యాదవ్ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో రుద్రభూమి కమిటీ అధ్యక్షుడు కూన అప్పారావు, దాతలు చింతాడ సత్యనారాయణ, బొడ్డేపల్లి శ్రీనివాసరావు, కూన ప్రసాదరావు, శివకిషోర్, రవీంద్రచారి, నరసింహులు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వీధి లైట్లు వెలగక ఇబ్బందులు

ఉంగుటూరు: కైకరం తూర్పు వీధిలో వారంరోజులనుంచి వీధిలైట్లు వెలగడం లేదు. దాంతో ఆవీధిలో ప్రజలు ఇబ్బందులు ఎదొర్కొంటున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళితే నిధులు లేవని, లైట్లు లేవని సమాధానం చెబుతున్నారని ప్రజలు వాపోతున్నారు. మూడో వీధిలో ఈ పరిస్థితి నెలకొంది. పాలకవర్గం సభ్యులు పట్టించుకుని వీధిలైట్లు వెలిగేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

దీపావళి సురక్షితంగా జరుపుకోవాలి

దెందులూరు: దీపావళిని సురక్షితంగా చేసుకోవాలని పెదవేగి సీఐ సీహెచ్ రాజశేఖర్ అన్నారు. బుధవారం దెందులూరు పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. చిన్నారులు దీపావళి సామగ్రి కాల్చేటప్పుడు తల్లిదండ్రులు దగ్గరే ఉండాలన్నారు. వ్యాపారస్తులు అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా దీపావళి సామగ్రి అమ్మినా నిలువ ఉంచినా కేసులు నమోదు చేస్తామన్నారు. పాత నేరస్తులు అందరిపై పూర్తిస్థాయి నిఘా ఉందన్నారు. నిబంధనలు అతిక్రమించి ఎటువంటి బాణసంచా అమ్మకాలు, నిల్వలు చేయరాదని సీఐ రాజశేఖర్ హెచ్చరించారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

పెదపాడు: సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులతో పరిచయాలు మంచిదికాదని పెదపాడు ఎస్సై కట్టా శారదా సతీష తెలిపారు. జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్, నూజివీడు డీఎస్పీ కెవీవీఎన్వీ ప్రసాద్ పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, గుడ్‌టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలకు గురైతే 1930కి సమచారం అందించాలని చెప్పారు. ఆపద సమయంలో 112కు సమాచారం అందించాలని సూచించారు. మీ పరిసర ప్రాంతాల్లో అసాంఘిక కార్యక్రమాలు జరిగితే వెంటనే ఏలూరు కంట్రోల్ రూమ్ 8332959175కు గాని, 9550351100 నంబరుకు గాని సమాచారం అందించాలని ఎస్సై చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కాలేజీల్లో నాణ్యమైన బోధన

గణపవరం: ప్రభుత్వ కళాశాలల్లో అన్ని వసతులు, ఉన్నత విద్యా అర్హతలున్న సీనియర్ అధ్యాపకులతో నాణ్యమైన విద్య అందుతుందని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పి.నిర్మలకుమారి అన్నారు. బుధవారం డిగ్రీ కాలేజిలో డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు ఈ నెల 31వ తేదీ వరకూ స్టూడెంట్ ఇండక్షన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు అధ్యాపకుల వివరాలు, బోధన తీరు, కాలేజీలో వసతులు, లేబొరేటరీ, లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్ వంటి సదుపాయాలను పరిశీలించొచ్చని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె.స్వరూపరాణి, అధ్యాపకులు కేవీ గణేష్ కుమార్, ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ జి.వెంకట రమణ, సిప్ కో-ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.